868) సామంతం / సామ

ప ||	ఎటువంటి మోహమో ఏట్టి తమకమో గాని । తటుకునను దేహమంతయు మరచె చెలియ ||

చ||	పలుకుతేనెల కొసరి పసిడి కిన్నెర మీటి । పలుచనెలుగున నిన్ను పాడిపాడి ।
కలికి కన్నీరు బంగారు పయ్యెద నొలుక । తలయూచి తనలోనె తలవంచు చెలియ ||

చ||	పడతి నీవును తాను పవళించు పరపుపై । పొడము పరితాపమున పొరలి పొరలి ।
జడిగొన్న జవ్వాది జారు చెమటల దోగి । ఉడుకు నూరుపుల నుసురుసురాయె చెలియ ||

చ||	తావిచల్లెడి మోముదమ్మి కడు వికసించె । లోవెలితి నవ్వులను లోగి లోగి ।
శ్రీవేంకటేశ లక్ష్మీకాంత నినుగలసి । ఈ వైభవము లందె ఇదివో చెలియ ||